దారితప్పిన కథ

కె. సునంద భార్గవి

"అమ్మాయి బంగారుబొమ్మ" అన్నాడాయన.

"నిజంగానా!" అన్నాడు సుందరరావు కుతూహలంగా ముందుకు వొంగుతూ.

"అవును. అంతేకాదు. ఒక్కతే కూతురు. దాదాపు మూడు లక్షల ఆస్తికి ఏకైక వారసురాలు. బియస్సీ పాసయ్యింది" అన్నాడాయన మళ్ళీ.

ఆయన పేరు జనార్దనం. సుందరరావుకు దూరపు బంధువు. ఓ సంబంధం గురించి సుందర్రావుకు చెప్పాలని ఒంగోలునించి వచ్చాడు.

అంతా విన్న సుందరరావు "ఇప్పుడేమిటి చెయ్యటం" అన్నాడు తల్లితో.

"నిజమే. మనం తొందరపడ్డాము సుందరం. ఇప్పుడేమిటి చెయ్యటం" అన్నదామె మళ్ళీ.

"ఏమయ్యింది?" అన్నాడు జనార్దనం.

"నేను చెబుతాను మామయ్యా! పది రోజుల క్రితమే ఒంగోలు వచ్చి ఓ సంబంధం చూశాము. ఆ అమ్మాయి బాగానే వున్నది. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తోంది. పదిహేనువేలు కట్నం అడిగాము. పన్నెండువేలు ఇస్తామన్నారు. ఇతర ఆస్తులు ఏవీలేవు. ఈ అమ్మాయితోపాటు ఇంకో ఇద్దరు అమ్మాయిలు పెళ్ళికి వున్నారు. ఇంతకీ విషయం ఏమిటంటే ఈ సంబంధాన్ని ఖాయపరచుకున్నాము. ఇదీ సంగతి" అన్నాడు సుందరరావు.

"అవును జనార్దనం. తొందరపడి ఒప్పుకున్నాము. ఇంతకీ నువ్వు చెప్పినవాళ్ళు కట్నం ఎంతవరకు ఇవ్వగలరు" అనడిగింది సుందర్రావు తల్లి.

"ఇరవై వేలకు తక్కువ ఇవ్వరు. కట్నం ఎంత ఇచ్చినా లక్షల ఆస్తికి ఏకైక వారసురాలు. అమ్మాయి అనసూయే కదా!" అన్నాడు జనార్దనం.

"కానీ ఈ అమ్మాయి ఉద్యోగం చేస్తోన్నది కదా!" అన్నాడు సుందరరావు.

"ఆ అమ్మాయి కూడా బ్యాంకు ఉద్యోగానికి సెలక్ట్ అయిందిట. ఇంకో నెలరోజుల్లో ఉద్యోగం వస్తోందని అనుకుంటున్నారు" అన్నాడు ఆయన.

"బ్యాంకు ఉద్యోగమా!" అన్నాడతను వెంటనే.

తల వూగించాడు ఆయన.

సుందరరావు కూడా బ్యాంకు ఉద్యోగమే చేస్తున్నాడు. ఆ అమ్మాయికూడా బ్యాంకు ఉద్యోగమే వస్తుందని తెలిసిన తర్వాత అతని మనసంతా అదోలా అయిపోయింది.

"నేనోమాట చెప్పనా?" అనడిగాడు జనార్దనం.

"ఏమిటి మామయ్యా"

"ఏ మీ లేదు. మీరు ఖాయపర్చుకున్న సంబంధానికి నీళ్ళొదిలి నేను చెప్పిన అమ్మాయిని చూడండి."

"ఇదెలాసాధ్యం. అమ్మాయి నచ్చిందనీ, పన్నెండువేలు కట్నానికి ఒప్పుకున్నాం కదా!" అన్నదామె.

"అవును మామయ్యా. ఇప్పుడు యే కారణంగా ఈ సంబంధాన్ని వదులుకుంటున్నట్టు వాళ్లకు తెలియపరచాలంటావ్?" సుందరరావు అడిగాడు. ఆ మాటకు జనార్దనం నవ్వి "చాలా సులభమైన కారణం ఒకటి ఉన్నది. ఆ అమ్మాయి ఉద్యోగం చేస్తున్నది కదా! ఆ అమ్మాయి గురించి ఎంక్వయిరీ

ఇ'వేమన'పద్యాలు

తలిమిగల యతనికి కన్యత నిచ్చుట
బావినీరు నదికి పార్చినట్లు
నిమ్మకు జలరాశి నీరెత్తినట్లుండు
పేదకియ్య మనుపు పెరుగువేమ.

చేశామనీ, ఆఫీసులో చాలామంది ఆ అమ్మాయి మంచిది కాదని చెప్పారనీ అందువల్ల ఈ సంబంధాన్ని వదులుకుంటున్నామనీ రాయండి. సరిపోతుంది'' అన్నాడు.

సుందరరావు మొఖం సంతోషంతో వెడల్పయింది.

''గుడ్ ఐడియా'' అన్నాడు చిరునవ్వుతో.

''అయితే ఇంకా ఆలస్యం ఎందుకు ? ఓ

దారి తప్పిన కథ

ఇన్లాండ్ కవరు వుంటే తీసుకరా. ఇప్పుడే ఉత్తరం రాసెయ్యి'' అన్నాడు జనార్దనం.

''వాళ్ళు బాధ పడతారేమో'' అన్నది తల్లి.

''ఎవరో బాధపడతారని లక్షలు తెచ్చే సంబంధాన్ని వదులుకుంటామా'' అన్నాడు జనార్దనం.

టేబిల్ సొరుగులోనించి సుందరరావు ఇన్లాండ్ కవరు — కలమూ తీసి ఉత్తరం రాయటం మొదలు పెట్టాడు. ఆతను చివరగా ఇలా రాశాడు :

''ఇంకానయం. మీ అమ్మాయి గురించి ముందుగానే తెలిసింది. కాబట్టి సరిపోయింది. లేకపోతే నా జీవితం కాలిపోయి వుండేది.''

ఉత్తరాన్ని చదివి వినిపించాడు సుందరరావు.

''భేష్ చాలా బావుంది. ఐతే నేను ఈ రోజునే ఒంగోలు వెళ్ళి మీరు రెండ్రోజుల్లో అమ్మాయిని చూడటానికి వస్తున్నట్టు చెబుతాను'' అన్నాడు జనార్దనం.

అందుకు తల్లీ — కొడుకు సరేనన్నారు.

* * *

జనార్దనం చెప్పినట్టుగా అనసూయ బంగారు బొమ్మలాగే వున్నది. సుందరరావుకు ఆమెను చూడటంతోనే కళ్ళు జిగేలుమన్నాయి.

కట్నం విషయం కూడా అప్పుడే మాట్లాడాడు జనార్దనం. ఇరవై రెండు వేలు. మరో మంచి రోజున తాంబూలాలు తీసుకుందామని తిరిగి వచ్చారు. సుందరరావు — అతని తల్లి.

''నిజంగా మనం అదృష్టవంతులం సుందరం'' అన్నది తల్లి.

''అవును. ఆ సావిత్రిని ఈ అనపాయతో పోల్చి చూస్తే చాలా దారుణంగా అనిపిస్తోంది. జనార్దనం మామయ్య ఈ సంబంధాన్ని తీసుకు రాకపోతే మనం చాలా నష్టపోయేవాళ్ళం'' అన్నాడతను.

అవునన్నది తల్లి.

మూడు రోజుల తర్వాత నిశ్చయ తాంబూలాలు తీసుకుందామని ఉత్తరం రాశాడు సుందరరావు.

అతను ఆ ఉత్తరాన్ని పోస్టు చెయ్యటానికి బయటకు వెళ్ళబోతున్నప్పుడు పోస్టుమేన్ వచ్చి ఆతనికో కవరు అందించాడు.

ఆ కవరు విప్పాడు సుందరరావ్.

అందులో ఇలా వున్నది :

''సుందరరావుగారూ— మీ గురించి మీ బ్యాంకులో ఎంక్వయిరీ చేశాము. మీ కారెక్టర్ మంచిది కాదనీ, మీరు ఓ ఇద్దరు అమ్మాయిలను నమ్మించి మోసం చేశారనీ తెలిసింది ఇంకా నయం. మీ గురించి ముందుగానే తెలిసింది కాబట్టి సరిపోయింది. లేకపోతే నా జీవితం కాలిపోయి వుండేది.''

పెళ్ళికూతురు అనసూయ రాసింది ఆ ఉత్తరాన్ని.

సుందరరావుకు షాక్ కొట్టినట్టు అనిపించింది. ఆ ఉత్తరం పూర్తిగా తను పెళ్ళి కూతురు సావిత్రికి రాసిన ఉత్తరం లాగే ఉన్నది. అవే వాక్యాలు. తను విసిరిన రాయి తనకే తగిలింది. సావిత్రి తన ఎదురుగా నిల్చుని నవ్వుతున్నట్టు అనిపించింది.

ఇంతకీ అనసూయ—సావిత్రి స్నేహితులని సుందరరావుకు తెలీదు పాపం!! ★